# వరిలో కలుపు నలిపితేనే గెలుపు

## నివారణకు అందుబాటులో రసాయనిక మందులు

**రకాన్నిబట్టి మందును పిచికారీ చేయాలి**

తగు సమయంలో సరైన మోతాదులో వాడాలి

కలుపు అదుపుతోనే వరిలో ఆశించిన దిగుబడులు



వరిలో కలుపు మందును పిచికారీ చేస్తున్న రైతు

గరిడేపల్లి, డిసెంబర్ 22 : వరి సాగు ఏ పద్ధతిలో చేపట్టినా అధిక దిగుబడి సాధన కోసం రైతులు కొన్ని జాగ్రత్తలు తప్పక తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా వరిలో కలుపు సమస్య అధికంగా ఉంటుంది. దాని నివారణకు సరైన సమయంలో చర్యలు చేపట్టకపోతే అధిక దిగుబడులు సాధించడం కష్టమౌతుంది. వరి సాగులో కలుపును ప్రారంభంలో అరికడితేనే దాని నుంచి ఆశించిన దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. ఒకప్పుడు పంటలో మొలిచిన కలుపును కూలీలతో తీయించేవారు. అయితే రానురాను కూలీల కొరత ఏర్పడడంతో పాటు కూలీ రేట్లు కూడా విపరీతంగా పెరుగడంతో రైతులు ఇతర పద్ధతులపై ఆధారపడాల్సి వచ్చింది. అదే సమయంలో కలుపును నివారించేందుకు అనేక రకాల హెర్బిసైడ్‌లు(కలుపు సంహారకాలు) మార్కెట్‌లోకి రావడం వల్ల రైతులకు సులువుగానే ఈ ఇబ్బంది తొలగిపోయినట్లైంది. మార్కెట్‌లో లభ్యమయ్యే ఈ రసాయనిక మందులను ఇష్టం వచ్చినట్లుగా వాడకుండా మొలిచిన కలుపును బట్టి ఏ మందు వాడాలి, ఎంత మోతాదులో వాడాలి, ఏ పద్ధతిలో వాడాలనేది పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాతే వాటిని పంట చేలో వాడడం వల్ల కలుపును పూర్తిగా నలిపి వేయడంతో పాటు ఆశించిన దిగుబడులు పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్త దొంగరి నరేశ్ వివరించారు. సమాచారం కోసం రైతులు 9290615952 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. వరిలో కలుపు నివారణకు ఆయన తెలిపిన వివరాలు..

### డ్రమ్ సీడర్, నేరుగా వెదజల్లే వరిలో..

- పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 10 శాతం-80 గ్రాములు ఎకరాకు 20 కిలోల ఇసుకలో కలిపి విత్తిన 3-5 రోజుల్లో జల్లుకోవాలి. దాంతో వెడల్పాకు కలుపు మొక్కలు, తుంగను నివారించవచ్చు
- ప్రెటిలాక్లోర్ 30 శాతం+ పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 0.75 శాతం నీటిలో కరిగే గుళికలు విత్తిన 3-5 రోజులకు 800 గ్రాములు ఎకరాకు జల్లుకోవాలి. వీటితో వెడల్పాకు కలుపు, తుంగ, ఏక వార్షిక గడ్డిజాతి కలుపును అరికట్టవచ్చు

**కలుపు 2-4 ఆకుల దశలో..**

- సైహాలో ఫాప్ బ్యుటైల్ 10 శాతం ద్రావకం 400 మిల్లీలీటర్లు ఎకరాకు 1.5 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసి ఊదగడ్డిని నివారించవచ్చు
- ఫెనాక్సీప్రోప్ ఈథైల్ 9.3 శాతం ద్రావకం 250 మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారి చేసి ఊద, ఏకవార్షిక గడ్డి నివారించవచ్చు
- మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ 10 శాతం+ క్లోరి మ్యూరాన్ ఈథైల్ 10 శాతం 8 గ్రాములు పిచికారి చేసి వెడల్పాకు కలుపు, తుంగను అరికట్టవచ్చు
- పెనాక్సులం 1.02 శాతం+సైహలోపాప్ బ్యుటైల్ 5.1 శాతం ద్రావకం 800-900 మిల్లీ లీటర్లు పిచికారి చేయాలి. దాంతో వెడల్పాకు, తుంగ, ఏకవార్షిక గడ్డి జాతి కలుపు నివారించవచ్చు
- ట్రయాఫామోన్+ఇథాక్సి సల్ఫ్యూరాన్‌ను 90 గ్రాములు ఎకరాకు పిచికారి చేసుకోవాలి

వరి నాటిన 3-5 రోజుల లోపు

- ప్రెటిలాక్లోర్ 50 శాతం ద్రావకం 500 మిల్లీ లీటర్లు లేదా ఆక్సాడయార్జిల్ 80 శాతం డబ్ల్యూపీ 50 గ్రాములు లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 70 శాతం నీటిలో కరిగే గుళికలు 120 గ్రాములు లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ 0.6 శాతం+ప్రెటిలాక్లోర్ 6 శాతం గుళికలు 4 కిలోలు లేదా ప్రెటిలాక్లోర్ 6.0 శాతం+పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 0.15 శాతం గుళికలు ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి జల్లుకోవాలి

**కలుపు 2-4 ఆకుల దశలో..**

- కొన్ని రకాల గడ్డి, వెడల్పాకు, తుంగ కలుపు మొక్కలు ఉన్నప్పుడు బిస్పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకంను ఎకరాకు 80-100 మిల్లీ లీటర్లు పిచికారి చేయాలి
- కొన్ని రకాల వెడల్పాకు కలుపు 2,4 డై ఈథైల్ ఎస్టర్‌ను ఎకరాకు 1.0 లీటర్ పిచికారి చేయాలి
- పెనాక్సులం 2.67 శాతం ద్రావకం 400 మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారి చేయాలి దాంతో కొన్ని రకాల వెడల్పాకు, తుంగను అరికట్టవచ్చు
- పెనాక్సులం 1.02 శాతం+సైహలోఫాప్ బ్యుటైల్ 5.1 శాతం ద్రావకం 800-900 మిల్లీ లీటర్లు పిచికారి చేసి కొన్ని రకాల వెడల్పాకు కలుపు, తుంగ, ఏక వార్షిక గడ్డిజాతి కలుపును నివారించవచ్చు
- ట్రయాఫామోన్+ఇథాక్సి సల్ఫ్యూరాన్‌ను 90 గ్రాములు ఎకరాకు పిచికారి చేసుకోవాలి

**జాగ్రత్తలు..**

- కలుపు మందును సిఫారసు చేసిన మోతాదులో అనువైన సమయానికి సరియైన పద్ధతిలో పిచికారి చేయాలి. సరైన నాజిల్‌ను ఉపయోగించాలి
- ఖచ్చితమైన సూచన లేకుండా ఇతర సస్య రక్షణ మందులతో కలిపి వాడరాదు



### సరైన మందుల ఎంపికతో కలుపు నివారణ తేలికే




వరి పంటలో కలుపు నివారణకు అనువైన రసాయనిక మందులు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. వాటి వాడకంతో కలుపు నివారణ తేలికే. అయితే అన్ని రకాల కలుపును నివారించేందుకు ఒకే రకమైన మందును పిచికారి చేయకుండా మొలిచిన కలుపును బట్టి కలుపు మందును ఎంపిక చేసుకోవాలి. అలాగే ఎప్పుడు పడితే అప్పుడు వాటిని వాడకుండా సరైన సమయంలోనే వాడాలి. సాధారణంగా పిచికారి చేయాలంటే కలుపు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు మందును సరైన మోతాదులో పిచికారి చేస్తే కలుపు నశించిపోతుంది. కలుపును నివారిస్తేనే పంట మొక్కలు బాగా ఎదిగి ఆశించిన దిగుబడులు సాదించే అవకాశం ఉంటుంది. కాబట్టి రైతులు కలుపు నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**- దొంగరి నరేశ్, కేవీకే ఇన్‌చార్జి పీసీ, గడ్డిపల్లి**

---

# యాసంగి సాగుకు భగీరథ ప్రయత్నం

## సాగు నీటికి విరివిగా బోర్లు వేస్తున్న రైతులు



నేరేడుచర్లలో బావిల్లో పూడిక తీయిస్తున్న రైతులు

- బావుల్లో పూడిక తీత
- నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో రైతుల ప్రత్యేక చొరవ
- సాగర్ ఆయకట్టులో నీటి విడుదల లేకపోవడమే కారణం
- వానకాలం వరి ధాన్యానికి మంచి ధర పలుకడంతో ముందుచూపు

పాలకవీడు, డిసెంబర్ 22 : కేసీఆర్ హయాంలో వరుసగా 18 సార్లు సాగర్ ఆయకట్టుకు నీరు వదలడంతో రైతులు ఏ ఇబ్బంది లేకుండా వ్యవసాయం పండుగలా చేసుకొన్నారు. గత వానకాలం ప్రారంభంలో నీటి విడుదల జరుగకున్నా నాటి నమ్మకంతో రైతులు వరిసాగు చేపట్టారు. తీరా ఎండిపోయే పరిస్థితి వచ్చేనాటికి ప్రభుత్వం నీటిని విడుదల చేయడంతో వేలాది ఎకరాల్లో పంట చేతికి వచ్చింది. దీనికి తోడు ధాన్యానికి వానకాలంలో సన్న రకానికి చెందిన వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,600 నుంచి రూ.3,200 ధర పలికింది. ఈ నేపథ్యంలో ఈ యాసంగి సాగు చేసేందుకు తమకున్న పంట పొలాల్లో నీటి లభ్యతను పెంచుకోవడం కోసం రైతులు విరివిగా బోర్లు వేయించుకొంటున్నారు. దీంతో పలు గ్రామాల్లో బోరు బండ్లు విరివిగా కన్పిస్తున్నాయి.

### బావుల పూడిక తీత, కొత్తగా బోర్లు

ఈ యాసంగికి కాల్వ ద్వారా సాగర్ నీటి విడుదల లేకపోవడంతో రైతులు ఉమ్మడి నేరేడుచర్ల మండలంలో సాగునీటికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. పంట సాగు కోసం కాలానికి ఎదురీదుతూ ఎడాపెడా బోర్లు వేస్తున్నారు. పాత బావుల్లో సైతం ఖర్చుకు వెనుకాడకుండా పూడికలు తీయిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీ ఎస్కవేటర్లు, ఆధునిక యంత్రాలను సైతం రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. బావుల పూడిక తీతకు గంటకు రూ.4,000 నుంచి 4,500 వరకు వసూలు చేస్తున్నారు. చిన్న బావులైతే 2 నుంచి 4గంటల సమయం, పెద్ద బావులైతే 4 నుంచి 8 గంటల సమయం పడుతున్నది. ఒక్కో రైతు సుమారు రూ.15 వేల నుంచి రూ.50 వేలు ఖర్చు చేస్తున్నారు.

### అశాస్త్రీయ పద్ధతులే దిక్కు

తమ పొలాల్లో నీటి లభ్యత పెంచడం కోసం రైతులు విరివిగా బోర్లు వేస్తున్నారు. బోర్లు వేయడానికి ముందు నీటి లభ్యతకు అనువైన ప్రదేశం ఎంచుకోవాలి. కానీ జియాలజిస్టులు అందుబాటులో లేకపోవడంతో రైతులు అశాస్త్రీయ పద్ధతులను నమ్ముకుంటున్నారు. కొబ్బరికాయలు చేతిలో పెట్టుకొని బోర్ పాయింట్‌లు చూపించుకుంటున్నారు. ఒక్కో బోర్ పాయింట్ చూసినందుకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు చెల్లిస్తున్నారు. రైతులు బోర్లు అధికంగా వేస్తుండడంతో బోర్ మిషన్ యజమానులు రేట్లు పెంచుతున్నారు. అడుగుకు రూ.350 నుంచి రూ.400 వరకు, కేసింగ్‌కు, డ్రిల్లింగ్ రూ.90 నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు. ఒక్క బోర్ వేసేందుకు రైతులకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతున్నది. వీటికి తోడు విద్యుత్ మోటర్, పైప్‌లైన్ కోసం మరో రూ.50 వేల నుంచి రూ.70 వరకు అవుతున్నది.

### అడుగంటుతున్న భూగర్భ జలాలు

గతంలో ఉమ్మడి నరేడుచర్ల మండలంలో బోర్లు 40 నుంచి 50 అడుగుల లోపు బోర్లు పడేవి. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ నేపథ్యంలో బోర్లు 60 నుంచి 300 అడుగుల వరకు వేస్తున్నారు. 600 అడుగుల వరకు బోర్లు వేసే సామర్థ్యం గల యంత్రాలు ఉండడంతో నీళ్ల కోసం ఎంతో లోతుకైనా వేయడానికి రైతులు వెనుకాడడం లేదు.

### భారీగా తగ్గనున్న వరి సాగు

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గత వానకాలంలో 4.37 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సాగర్ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది యాసంగి సాగుకు నీటి విడుదల చేయడానికి అవకాశాలు లేకపోవడంతో భారీగా వరి సాగు విస్తీర్ణం తగ్గనుంది. జిల్లాలో వానకాలంతో పోలిస్తే లక్ష ఎకరాల్లో వరిసాగు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వానకాలంలో పాలకవీడు మండలంలో 17,251 ఎకరాల్లో వరిసాగు కాగా యాసంగిలో 11 వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెప్తున్నారు.

### వరికి మంచి ధర ఉండడంతోనే బోర్లు వేస్తున్నాం..



వానకాలంలో పండిన వరికి మంచి ధర పలుకడంతో యాసంగిలో ఎంత ఖర్చయినా సరే పంట సాగు చేయాలనుకున్నారు. దాంతో కొత్తగా బోర్లు వేస్తున్నాం ఈ ఏడాది నాకున్న పొలంలో రెండు కొత్త బోర్లు వేయించిన, లక్ష రూపాయల వరకు ఖర్చు అయినాయి. అయినా పంట పండిస్తే మంచి ధర వస్తుందని నమ్మకం ఉంది.

**-యరెడ్ల సత్యనారాయణరెడ్డి, రైతు**

### బోర్లు వేయించుకునే రైతుల సంఖ్య పెరిగింది




గతంలో కొద్దిమంది పెద్ద రైతులు మాత్రమే బోర్లు వేయించుకునే వారు. ఈ యాసంగి సాగులో చిన్న రైతులు కూడా ఎక్కువగా బోర్లు వేయించుకుంటున్నారు. గతంలో ఈ సీజన్‌లో ఒక్కో మండలంలో 20 నుంచి 30 బోర్లు వేసే వాళ్లం. ఇప్పుడు 60 నుంచి 100 బోర్లు వేస్తున్నాం. బోర్లు వేయించుకునే వారి సంఖ్య పెరుగడంతో తీరిక లేకుండా పనిచేస్తున్నాం.

**-వెంకన్న, బోరు మిషన్ యజమాని**

---

# ‘పార్లమెంట్’కు సన్నద్ధం..

**లోక్‌సభ ఎన్నికలకు ముమ్మర కసరత్తు**



- అటు అధికారులు.. ఇటు పార్టీల ప్రణాళిక
- వచ్చే వారం నుంచి వివిధ ఎన్నికల కమిటీల నియామకం
- గెలుపు కోసం రాజకీయ పార్టీల ఫోకస్
- బరిలో నిలిచేందుకు పలువురు నేతల ఆసక్తి
- అధిష్టానం మెప్పు కోసం ప్రయత్నాలు

దేశ వ్యాప్తంగా వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. మన దగ్గర భువనగిరి పార్లమెంట్ సెగ్మెంట్ ఉంది. దీని పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం అసెంబ్లీలు ఉన్నాయి. భువనగిరి కేంద్రంగా ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ, కార్యకలాపాలు ఉండనున్నాయి. ఇక ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేలా సిద్ధం అవుతున్నారు. ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లనున్నారు. వచ్చే వారంలో ఎన్నికల సంఘం నుంచి వివిధ అంశాలపై ఆదేశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వచ్చే వారం ఎన్నికలకు సంబంధించి పలు కమిటీలను నియమించనున్నారు. దాంతో ఆయా కమిటీలకు వివిధ పనుల్లో నిమగ్నం కానున్నాయి. ప్రతి రోజు సమావేశాలు, సమీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా అధికారులతో రివ్యూలు చేపడుతూ సలహాలు, సూచనలు చేయనున్నారు.

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)

### ఓటరు నమోదు షురూ..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొత్త ఓటర్ల నమోదుతోపాటు మార్పులు, చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. తుది జాబితా కూడా విడుదల చేసింది. ఇప్పుడు మళ్లీ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరో సారి కొత్త ఓటర్ల ప్రక్రియకు మరో ఛాన్స్ ఇచ్చింది. ఈ మేరకు ఇటీవల షెడ్యూల్ కూడా విడుదల చేసింది. ఈ నెల 20 నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. జనవరి 5వ వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పులుకు అవకాశం ఉంది. జనవరి 6న ఓటరు ముసాయిదా జాబితా, 8న తుది జాబితాను ప్రకటించనున్నారు.

### రాజకీయ పార్టీల ఫోకస్..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. ఎలాగైనా ఎంపీ సీటును కైవసం చేసుకోవాలని కార్యాచరణ రూపొందిస్తున్నాయి. అధిష్టానాలు ఎప్పటికప్పుడు స్థానిక పరిస్థితులపై ఆరా తీస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఏకంగా భువనగిరి ఇన్‌చార్జ్‌గా ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని నియమించింది. బీఆర్ఎస్ పార్టీ భువనగిరిపై స్పెషల్ ఫోకస్ పెట్టి, పలువురు నేతలతో సమాలోచనలు చేసినట్లుగా తెలిసింది. బీజేపీ వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల్లోకి వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నది.

### మెప్పు కోసం నేతల ప్రయత్నాలు..

ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ప్రజల్లోకి వెళ్లేందుకు నేతలు నానాతంటాలు పడుతున్నారు. అటు పార్టీల అధిష్టానం మెప్పు పొందేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పోటీకి ఆసక్తి చూపుతున్నారు. తాము టికెట్ రేస్‌లో ఉన్నామని, తమకే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. స్థానికంగా నేతలతో సైతం తమకే టికెట్ వస్తుందని పలువురు నేతలు బహిరంగంగా చెప్పడం గమనార్హం. మరోవైపు జనంలోకి వెళ్లేందుకు సదరు నేతలు పాట్లు పడుతున్నారు. ప్రజలకు దగ్గరయ్యేందుకు తమవంతు కార్యక్రమాలు చేపడుతున్నారు.

---

# ముక్కోటికి ఆలయాలు సిద్ధం

మఠంపల్లి, డిసెంబర్ 22 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టపల్లి క్షేత్రానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా స్నానపుఘాట్లు, తాత్కాలిక డ్రెస్సింగ్ రూంలు, క్యూలైన్‌లు, లడ్డూ ప్రసాద విక్రయానికి ప్రత్యేక కౌంటర్లు, అన్నదానానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం మంగళవాయిద్యం, వేదమంత్ర పఠనం, శాస్త్రీయ సంగీత కచేరి, లక్ష్మీనరసింహ నామ సంకీర్తనం శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు తెలిపారు. 23న ప్రాతఃకాలంలో ఉదయం 5గంటలకు స్వామి వారి వైకుంఠద్వార దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

బొడ్రాయిబజార్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వారం ద్వారా వైకుంఠ నాథుడి దర్శనానికి దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవాలయంలోని పశ్చిమ భాగంలో ఏడు గోపురాలు, ఏడు ద్వారాలు, మూడు క్యూ లైన్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, ఈఓ ఏరువ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



సూర్యాపేట పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి చేసిన ఏర్పాట్లు



మఠంపల్లి : మట్టపల్లిలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు